


పత్తాలేని ఫీజు రీయింబర్స్‌మెంట్

- ఉపకార వేతనాలదీ అదే పరిస్థితి
- మూడేళ్లుగా విడుదల కాని వైనం
- ఆందోళనలో కళాశాలల యాజమాన్యాలు
- విద్యార్థులపై పెరుగుతున్న ఒత్తిడి





(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

మూడేళ్ళుగా ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలను విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆయా కళాశాలల యాజమాన్యాలు ఫీజు చెల్లించాలని విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయి. ప్రభుత్వం నుంచి ఫీజు నిధులు విడుదల కాగానే తిరిగి డబ్బు వాపసు ఇస్తామని అంటున్నాయని ఆరోపణలు వస్తున్నాయి.

● రూ. 171.13 కోట్ల బకాయిలు

జిల్లాలో 2021-22 నుంచి 2023-24 వరకు మూడు సంవత్సరాల్లో 171.13 కోట్ల రూపాయల బకాయిలు పేరుకుపోయాయి. బీసీ సంక్షేమ శాఖ ద్వారా బీసీ విద్యార్థులకు రావలసిన బకాయిలు 131.35 కోట్లు ఉన్నాయి. ఈ బకాయిలు ఇలా ఉండగానే కొత్తగా చేరుతున్న విద్యార్థులు మళ్లీ దరఖాస్తు చేసుకుంటున్నారు. బీసీ సంక్షేమ శాఖలోనే స్కాలర్‌షిప్ కోసం గత మూడేళ్లలో 1,35,000 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకోగా వీరికి 118.4 కోట్ల రూపాయలు బకాయిలు పడ్డాయి. ఈబీసీ కేటగిరీ కింద ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం 6,984 మంది దరఖాస్తు చేసుకోగా వీరికి 12.95 కోట్ల రూపాయలు మంజూరు కావలసి ఉంది. బీసీ విద్యార్థులకు 131.35 కోట్లు రావలసి ఉండగా, ఎస్సీ సంక్షేమశాఖలో దరఖాస్తు చేసుకున్న 11,075 మంది విద్యార్థులకు 30.28 కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉన్నది. ఎస్టీ సంక్షేమ శాఖలో 4,700 మంది విద్యార్థులకు 7.5 కోట్లు, మైనార్టీ సంక్షేమశాఖలో ఐదు వేల మంది విద్యార్థులకు ఎనిమిది కోట్ల రూపాయల బకాయిలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉన్నది. మూడేళ్ల బకాయిలు ఉన్నా రెండేళ్లకు సంబంధించిన బకాయిల్లో సగం శాతం నిధులు మాత్రమే ఆయా కళాశాలలకు విడుదల చేసినట్లు సమాచారం. 50 శాతం రెండేళ్ల బకాయిలు, ఒక సంవత్సరం మొత్తం బకాయిలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించి, పాఠశాలలు, కళాశాలలు నడిపించడం కష్టంగా మారిందని ప్రైవేట్ యాజమాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

● సర్టిఫికెట్లు అందక ఇబ్బందులు

సగం శాతం నిధులు విడుదల అయినట్లు పేర్కొని ఏడాది కావస్తున్నా విద్యార్థుల ఖాతాల్లో మాత్రం ఆ నిధులు జమ కాలేదు. దీంతో విద్యార్థులు, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులకు గురుతున్నారు. విద్యను పూర్తిచేసుకొని సర్టిఫికెట్ తీసుకోవలసిన విద్యార్థులకు ఈ బకాయిలు తప్పకుండా చెల్లించాల్సిన పరిస్థితి ఉత్పన్నమవుతున్నది. ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు రాక పోవడంతో ఆ డబ్బు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని, ప్రభుత్వం నుంచి నిధులు రాగానే చెల్లించిన డబ్బు వాపసు చేస్తామని యాజమాన్యాలు చెబుతున్నట్లు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం విద్యాసంస్థల జేఏసీ ఆందోళనకు దిగేందుకు సిద్ధమై ప్రభుత్వానికి నోటీసులు కూడా అందజేసింది. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయకపోతే ఫస్ట్ యర్ విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయాలని టీజేఏసీ ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలకు పిలుపునిచ్చింది. ప్రభుత్వం వెంటనే ఈ నిధుల చెల్లింపుపై దృష్టిసారించి తమ చదువులకు ఆటంకం లేకుండా చూడాలని విద్యార్థులు కోరుతున్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా చాహత్ బాజ్‌పాయ్



కరీంనగర్ టౌన్, ఆగస్టు 20: కరీంనగర్ నగరపాలక సంస్థ కమిషనర్‌గా చాహత్ బాజ్‌పాయ్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి నియామక ఉత్తర్వులను జారీ చేశారు. 2019 ఐఏస్ బ్యాచ్‌కు చెందిన ఆమెను కరీంనగర్ కమిషనర్‌గా నియమిస్తూ పోస్టింగ్ ఆర్డర్ ఇచ్చారు. ఒకటి, రెండురోజుల్లో ఆమె బాధ్యతలు స్వీకరిస్తారని తెలిస్తోంది. ఆమె ఇంతకు ముందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూర్‌లో సబ్ కలెక్టర్‌గా పని చేశారు. అనంతరం తెంగాణ క్యాడర్‌కు మారారు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో అడిషనల్ కలెక్టర్‌గా, ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఐటీడీఏ పీవోగా పని చేశారు. ప్రస్తుతం చాహత్ బాజ్‌పాయ్ పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు గ్రేటర్ హైదరాబాద్ నుంచి బదిలీపై వచ్చిన శ్రీనివాస్ దీర్ఘకాలిక సెలవుల్లో వెళ్లారు. దీంతో కరీంనగర్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్‌కి కలెక్టర్ ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. 2025 జనవరి 29తో ప్రస్తుత పాలకవర్గ పదవీ కాలం ముగియనుంది. ఇటీవల బల్దియాలో అదనపు కమిషనర్ నుంచి నాలుగో తరగతి ఉద్యోగుల వరకు చాలా మంది బదిలీ అయ్యారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు 131 కోట్ల పట్టణ ప్రగతి, సీఎం హామీ నిధులతో ప్రారంభించిన అనేక అభివృద్ధి పనులను అసంపూర్తిగా వదిలిపెట్టారు. నిధుల లేమి కారణంగా అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. మరోవైపు బల్దియా పాలకవర్గ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తిరిగి ఐఏఎస్ అధికారిని కమిషనర్‌గా నియమించి నగరపాలక సంస్థను గాడిలో పెట్టాలని పాలకవర్గసభ్యులతోపాటు ప్రజలు ప్రభుత్వాన్ని కోరారు. ఈ నేపథ్యంలో యువ ఐఏఎస్ అధికారి చాహత్ బాజ్‌పాయ్‌ని కమిషనర్‌గా నియమించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం

కరీంనగర్ టౌన్, ఆగస్టు 20: జిల్లాలో మోస్తరు వర్షం కురిసింది. సోమవారం ఉదయం 8.30 నుంచి మంగళవారం ఉదయం 8.30 గంటల వరకు 2.6 మి.మీ, సగటు వర్షాపాతం నమోదైంది. గంగాధరలో 12.8, గన్నేరువరంలో 10.2, రామడుగులో 6.8, చిగురుమామిడిలో 2.2, ఇల్లందకుంటలో 2, తిమ్మాపూర్‌లో 1.6, కరీంనగర్‌లో 1.4, కరీంనగర్ రూరల్‌లో 1.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన పూర్తిచేయాలి

● రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

కరీంనగర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన సకాలంలో పూర్తి చేయాలని, అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచిం చారు. మంగళవారం ఆయన ఖమ్మం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు అంశాలపై మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎల్‌ఆర్‌ఎస్‌కు సంబంధించి 20 లక్షలకుపైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. సిబ్బంది కొరత ఉన్నచోట అవసరమైతే తాత్కాలిక ప్రాతిపదికన అదనపు సిబ్బందిని నియమించుకుని పనులు పూర్తి చేయాలని సూచిం చారు. ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ ద్వారా ప్రభుత్వ భూమికి నష్టం జరగకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. రాబోయే ఐదు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ధరణి పోర్టల్ లో పెండింగ్ ఉన్న దరఖాస్తుల స్క్రూటినీ పూర్తి చేసి పరిష్కరించాలని, తిరస్కరించే దరఖాస్తులకు కారణాలు తెలియజేయాలన్నారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నూతన ఆర్వోఆర్ చట్టం ముసాయిదా బిల్లు ప్రతిపాదించిందని, దీని పై జిల్లాల్లో 23, 24 తేదీల్లో వర్క్ షాప్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ పాల్గొన్నారు.

అధికారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు కళ్లు

- అర్హులకు కేంద్ర పథకాలు అందేలా చూడాలి
- కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్

కరీంనగర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అధికారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు కళ్ల అని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా అధికారులు చూడాలన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా పనిచేయాలన్నారు. ప్రతి శాఖకు కేంద్రం నుంచి అందాల్సిన సహకారంపై ప్రణాళికలు రూపొందించాలన్నారు. పీఎం స్రీనిధి, నేషనల్ హెల్త్‌మిషన్, స్మార్ట్ సిటీ పోషన్ అభియాన్, మధ్యాహ్న భోజనపథకం, పౌర సరఫరాలు, ఆయిల్ పామ్, రోడ్ల నిర్మాణం పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయిల్ పామ్ తోటల పెంపకానికి రైతులకు 12 వేల కనీస మద్ధతు ధర ఇస్తుందని, రైతులు ఆశించిన స్థాయిలో ముందకు రావడంలేదన్నారు. పంచాయతీల్లో బిల్లులు ఆగిపోవడానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. 15వ ఆర్థికసంఘం నిధులు కేంద్రం ప్రభుత్వం క్రమం తప్పకుండా ఇస్తుందన్నారు. రెండున్నరేళ్లగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కావడం లేదని అధికారులు బదులిచ్చారు. జిల్లాలో ఎంఎస్ఎంఈ ఎక్స్‌టెన్షన్ కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని అధికారులు సూచించారు. కరీంనగర్ నుంచి హసన్‌పర్తి వరకు రైల్వే లైన్ ఏర్పాటుకు సర్వే పూర్తయిందని, ప్రసాద్ పథకంలో వేములవాడ, కొండగట్టు అలయాలను చేర్చడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. కరీంనగర్-జగిత్యాల రోడ్డు విస్తరణ పనులను త్వరగా ప్రారంభించాలన్నారు. తీగలగుట్టపల్లి ఆర్వోబీ నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతుందని త్వరితగతిన పనులు జరిగేలా చూడాలన్నారు. కేంద్రం తెలంగాణకు ఇచ్చిన సీఆర్ఐఎఫ్ నిదుల్లో అత్యధికంగా కరీంనగర్ పార్లమెంట్‌కు తీసుకు వచ్చామన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు యాక్షన్‌ప్లాన్ రూపొందించాలని అన్ని పథకాల అమలులో ప్రభుత్వ మార్గదర్శకాలు తప్పపకుండా పాటించాలన్నారు. అధికారులకు సంపూ ర్ణ సహకారం అందిస్తామన్నారు. జిల్లాకు అధికనిధులు కేటాయించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మికిరణ్, డీఎఫ్‌వో బాలమణి, ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్, డీఆర్వో పవన్‌కుమార్, ఆర్డీవో మహేశ్వర్, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలి

● జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు

పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలని కోరుతూ మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు జరిగాయి. పలు మండలాల్లో రైతులు ధర్నాలు చేసి నిరసన తెలిపారు. బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు ఆందోళనలు నిర్వహించిన రైతులకు మద్దతు తెలిపారు.

చిగురుమామిడి, ఆగస్టు 20: అర్హులైన రైతులందరికీ పంట రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో రైతులు మంగళవారం ధర్నా నిర్వహించారు. బీఆర్‌ఎస్ మండల నాయకులు వారికి మద్దతు పలికారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అక్కడే ఉన్న కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేసినారు. ఇరు వర్గాలను పోలీసులు శాంతింప చేశారు. మండల కేంద్రాంలోని రైతు వేదిక ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

● వీణవంక: మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో రాస్తారోకో చేసి రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు.

●శంకరపట్నం: మండల కేంద్రంలోని కరీంనగర్-వరంగల్ రహదారిపై బీజేపీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు.

●రామడుగు: ఆంక్షలు లేకుండా రైతులకు రుణమాఫీ చేయాలని కోరుతూ బీజేపీ నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.

● మానకొండూర్: బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యం లో మండల కేంద్రంలో ధర్నా చేశారు.

● చొప్పదండి: పట్టణంలో బీజేపి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.

● ఇల్లందకుంట: మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

● గన్నేరువరం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.



చిగురుమామిడి మండలంలో ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

సీపీఐకి ప్రజలే ముఖ్యం

- రుణమాఫీ పూర్తి స్థాయిలో చేయాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు



హుజూరాబాద్‌లో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు

హుజూరాబాద్, ఆగస్టు 20: సీపీఐకి ప్రజలే ముఖ్యమని, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు అన్నారు.హుజూరాబాద్‌లో సీపీఐ జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశాన్ని మంగళవారం అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా వద్ద బహిరంగ సభలో సాంబశివరావు మాట్లాడుతూ పేదల గుండె చప్పుడు ఎర్రజెండా పార్టీ అయిన సీపీఐ అన్నారు. ప్రజా సమస్యలే తమ ఎజెండా అన్నారు. కమ్యూనిస్టు పార్టీ ప్రజల పక్షాన పోరాడుతుందే తప్ప ఏ పార్టీకి వత్తాసు పలుకబోదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల పక్షాన నిలబడి సలహాలు, సూచనలు అందిస్తామన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన విధంగా రెండు లక్షల రుణమాఫీ చేయకపోతే రైతుల పక్షాన పోరాడుతామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ బల హీనత బీజేపీకి బలమైందన్నారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ నాయకులు బీజేపీకి ఓట్లు వేశారన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఏమి చెప్పినా ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని, ఆ పార్టీ ఉంటుందా లేదా అనేది కేసీఆర్ చూసుకోవాలన్నారు. రానున్న కాలంలో బీఆర్‌ఎస్ పార్టీ భూస్థాపితం అవుతుందని దీమా వ్యక్తం చేశారు. అనంతరం హుజూరాబాద్ జర్నలిస్టుల ఇళ్ల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జర్నలిస్టులు ఎమ్మెల్యే సాంబశివరావుకు వినతిపత్రం సమర్పించారు. డీఎస్సీ 1998 క్వాలిఫైడ్ టీచర్లకు ఉద్యోగాలు ఇప్పించాలని నిరుద్యోగులు కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, గోవిందుల రవి, రామారావు వెంకటేష్, సృజన్‌కుమార్, సదానందం, పవన్, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

● భూములు సర్వే చేయకుండా ఏ చట్టం తెచ్చినా వృథా..

భూములు సర్వే చేయకుండా ఏ చట్టం తీసుకువచ్చినా వృథా అవుతుందే తప్ప పూర్తి స్థాయిలో అమలు కాదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. రాష్ట్రంలో అనేక బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించాలన్నారు. కొత్తకొండ వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ముందు అనేక సవాళ్లు ఉన్నాయన్నారు. మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీ కార్యకర్తలు, సర్పంచ్‌ల బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కార్పొరేట్ పాఠశాలలో

రూ.4.5 లక్షల ఫీజు స్వాహా

సొంత అకౌంట్‌లోకి ఫీజుల బదలాయింపు

గతంలో మరో కార్పొరేట్ పాఠశాలలోనూ ఇదే తరహా ఘటన

కలవర పడుతున్న పోషకులు

కోల్‌సిటీ, ఆగస్టు 20: గోదావరిఖనిలో మరో కార్పొరేట్ పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది కలిసి విద్యార్థుల ఫీజులు స్వాహా చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. రూ.4.5లక్షల ఫీజులను సదరు ప్రిన్సిపాల్ వాడుకున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో ఫీజులు చెల్లించేందుకు వచ్చిన పోషకుల నుంచి తమ స్కూల్ అకౌంట్ పని చేయడం లేదని తమ సొంత అకౌంట్‌లలోకి పంపాలంటూ బదలాయించుకున్నట్టు తెలుస్తున్నది. సదరు పాఠశాల యాజమాన్యం మాత్రం ఇప్పుడే తామేమి చెప్పలేమని, అన్నీ విషయాలు పరిశీలన చేస్తున్నామని పేర్కొంటున్నది.

గత సంవత్సరం గోదావరిఖని మార్కండేయకాలనీలోని ఒక ప్రముఖ కార్పొరేట్ పాఠశాలలో కూడా ప్రిన్సిపాల్ సుమారు రూ.7లక్షల వరకు విద్యార్థుల ఫీజులతో ఉడాయించిన ఘటన వెలుగు చూసింది. యాజమాన్యం ఆధారాలు చూపిన విద్యార్థుల ఫీజులను మాత్రం సర్దుబాటు చేసుకుంది. ఆధారాలు లేని వారి నుంచి మళ్లీ వసూలు చేసింది. హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తున్న కార్పొరేట్ పాఠశాలల్లో ఈ తరహా మోసాలు జరుగడం కలవరపెడుతుంది.

కొండగట్టులో భక్తుల సందడి



కొండగట్టులో అంజన్న సన్నిధిలో భక్తులు

మల్యాల, ఆగస్టు 20: కొండగట్టు అంజనేయస్వామి సన్నిధానంలో మంగళవారం సందడిగా మారింది. వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయంలో అభిషేకాలు చేశారు. అనంతరం భేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. నూతన వాహనాలకు భక్తులు స్వామి సన్నిధిలో వాహన పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో రామకృష్ణరావు ఇతర అధికారులు పర్యవేక్షించారు.

ఆదమరిస్తే అంతే..



రామడుగు వాగుపై ఉన్న వంతెనపై పక్కకు ఒరిగిన టిప్పర్

రామడుగు, ఆగస్టు 20: రామడుగు వాగుపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదాలు జరిగే పరిస్థితి నెలకొంది. ఈ వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో అధికారులు అప్పుడప్పుడు మొరం పోసి తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారు. భారీ వాహనాల రాకపోకలతో గుంతలు పడి దిగబడుతున్నాయి. మంగళవారం ఓ టిప్పర్ వంతనెన దాటుతూ దిగబడి పక్కకు ఒరిగింది. కొత్త వంతెన పూర్తయినా ప్రారంభించడం లేదు. ఇకనైనా కొత్త వంతెనను ప్రారంభించాలని మండల వాసులు కోరుతున్నారు.

దుబ్బపల్లిలో పేకాట స్థావరంపై దాడి

మంథనిరూరల్, ఆగస్టు 20: మంథని మండలంలోని దుబ్బపల్లి గ్రామ శివారులో పేకాట శిబిరంపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. పేకాట ఆడుతున్న సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, మంథని పోలీసులు దాడి చేయగా ఏడుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి 3 బైక్‌లు, ఏడు సెల్‌ఫోన్‌లు, రూ. 20,390 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

పిగుడుపాటుకు వ్యక్తి మృతి

మంథనిరూరల్, ఆగస్టు 20: మండలంలోని పందులపల్లికి చెందిన ఉడుత నారాయణ(52) సోమవారం రాత్రి పడుగుపాటుతో మృతి చెందినట్లు మంథని ఎస్ఐ రమేష్ మంగళవారం తెలిపారు. నారాయణ తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో పిడుగుపాటు గురై మృతిచెందినట్లు భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ తీగలతో చేపలను వేటాడిన వ్యక్తి రిమాండ్

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 20: వ్యవసాయ పొలం వద్ద ఉన్న బోరు మోటారు విద్యుత్ తీగలను అపహరించి సమీప వాగులో చేపలను వేటాడిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన కుంచం పర్శరాములపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ రమాకాంత్ మంగళవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామానికి చెందిన వట్టెల రాజు బోరు మోటారు కరెంటు తీగలను ఈ నెల 13న కుంచం పర్శరాములు దొంగిలించి సమీపంలోని వాగులో చేపలు పట్టాడు. విషయం రాజుకు తెలియడంతో విద్యుత్ తీగలను ఇవ్వాలని కుంచం పర్శరాములును కోరగా అందుకు ఆయన బెదిరింపులకు దిగాడు. కరెంటు తీగలను అపహరించడంతో పాటు విద్యుత్‌తో వాగులో చేపలను వేటాడిన కుంచం పర్శరాములుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ రమాకాంత్ పేర్కొన్నారు. నీటి వనరుల్లో విద్యుత్ షాక్‌లు పెట్టి ఎవరైనా చేపలు వేటాడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కస్టమ్ గోల్డ్ ఉచ్చులో ఖని వ్యాపారులు

రూ.10కోట్లు పోగొట్టుకున్న బాధితులు

హైదరాబాద్‌లో మోసగాళ్లను పట్టుకున్న పోలీసులు

తలలు పట్టుకుంటున్న రామగుండం వ్యాపారులు

కోల్‌సిటీ, ఆగస్టు 20: కస్టమ్స్ పట్టుకున్న బంగారం తక్కువ ధరకు ఇస్తామంటూ హైదరాబాద్‌కు చెందిన కొందరు మోసగాళ్లు పన్నిన ఉచ్చులో గోదావరిఖనికి చెందిన వ్యాపారులు పడ్డారు. సమారు రూ.10కోట్లు పోగొట్టుకున్నట్టు తెలుస్తోంది. కస్టమ్స్ అధికారులు పట్టుకున్న బంగారంలో సగం వరకు ప్రభుత్వ లెక్కల్లో చూపరని, దానిని మధ్యవర్తుల ద్వారా తక్కువ ధరకు ఇస్తామంటూ హైదరాబాద్‌కు చెందిన కొందరు వ్యక్తులు రామగుండం ప్రాంతానికి చెందిన వ్యాపారులతో బేరాలు కుదుర్చుకున్నారు. మొదట తక్కువ మోతాదులో అసలు బంగారం ఇవ్వడంతో నమ్మిన ఈ ప్రాంత వ్యాపారులు తమకు దగ్గర ఉన్న మరికొందరు వ్యాపారులను ఈ దందాలోకి దించినట్టు తెలుస్తోంది. రెండుమూడు సార్లు ఈ విధంగా ట్రేడింగ్ చేసిన వ్యాపారులు వారికి మధ్యవర్తులుగా మారిపోయారు. దీంతో ఈ గోల్డ్ ట్రేడింగ్‌లో కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టినట్టు తెలుస్తోంది. చివరికి హైదరాబాద్ చెందిన వ్యక్తులు మకాం ఎత్తివేసి వ్యాపారులకు దొరకకుండా తప్పించుకుని తిరిగారు. వీరిని హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేయడంతో ఈ దందా వెలుగు చూసింది. రెండుమూడు స్థావరాలు ఏర్పాటు చేసుకుని నకిలీ నోట్ల కట్టలు, నకిలీ బంగారం బిస్కెట్లను ఎరగా చూపి గోదావరిఖనికి చెందిన వ్యక్తుల నుంచి భారీ ఎత్తున వసూళ్లకు పాల్పడినట్టు తెలుస్తోంది. ఇంట్లోని బంగారం, ప్లాట్లు, ఆస్తులు తాకట్టుపెట్టి తెచ్చిన డబ్బులు కూడా పెట్టుబడి పెట్టారని చర్చ జరుగుతోంది.

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి

కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి/రామడుగు/బోయినపల్లి, ఆగస్టు 20: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. మంగళవారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 11,427 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిడ్ మానేరులోకి రెండు మోటార్ల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎన్టీపీసీకి, తాగునీటి అవసరాల కోసం 452 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 15.352 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ఇప్పటి వరకు 16.4 టీఎంసీల నీటిని ఎత్తిపోశారు. మిడ్ మానేరు ప్రాజెక్టులోకి 5,261 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 3150, మానేరు, మూలవాగు ద్వారా 2,111 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 16.21 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది. మిడ్ మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 3200, కుడి కాలువకు వంద క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా పెరిగిన ఇన్‌ఫ్లో

జగిత్యాల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో రావడం మంగళ వారం కొంత పెరిగింది. ఎస్సారెస్పీలోకి 14,450 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 50.07 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు ప్రాజెక్టు నుంచి 4,453 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

కళాశాల బోధనను సద్వినియోగం చేసుకోవాలి

ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రభాకర్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రభాకర్

కొడిమ్యాల, ఆగస్టు 20 : కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధనను ఇంజనీరింగ్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. ప్రభాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలోని జేఎన్ ఆడిటోరియంలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో ఉన్న వసతులను, సౌకర్యాలను విపులంగా వివరించారు. సాంకేతిక విద్యా బోధన, పరీక్షల నిబంధనలు విద్యార్థులకు తెలిపారు. హాస్టల్‌లో ఉన్న వసతులను తెలిపారు. కళాశాలలో విద్యార్థులు పాటించాలిసిన విధానాలను, తల్లిదండ్రుల బాధ్యతలను వివరించారు. అంతకు ముందు జ్యోతి ప్రజ్వలన చేశారు. వివిధ విభాగాల అధిపతులను విద్యార్థుల తల్లిదండ్రులకు పరిచయం చేశారు. ఈ ఓరియెంటేషన్ కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు డా.. కె. శ్రీనివాస్, డా.. బి. సతీష్‌కుమార్, డా.. ఎస్. సురేష్‌కుమార్, డా.. వై. రాజశేఖర్‌రెడ్డి, డా.. సురేష్‌అర్జుల్లా, అసిస్టెంట్ రిజిస్ట్రార్ జి. దామోదర్ రెడ్డి, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాజన్న సేవలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్



నేరెళ్ల శారదకు రాజన్న ప్రసాదం అందజేస్తున్న ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ కల్చరల్, ఆగస్టు 20: వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద మంగళవారం దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి విచ్చేసిన ఆమెకు రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీస్వామి వారి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కల్యాణ మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావిం చగా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి రాజన్న ప్రసాదం అందజేసి శేషవస్త్రం కప్పి సన్మానిం చారు. ఆమె వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, కనికరపు రాకేష్, సాగరం వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

కొండగట్టు అంజన్న సన్నిధిలో పూజలు

మల్యాల: రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద మంగళవారం కొండ గట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. కుటుంబసభ్యులతో వచ్చిన చైర్‌పర్సన్‌కు ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలుకగా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆలయ ఈవో రామకృష్ణరావు శేషవస్త్రాలతో సత్క రిం చారు. ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. చైర్‌పర్సన్ వెంట ఆలయ, రెవెన్యూ అధికారులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



కొండగట్టులో పూర్ణకుంభంతో స్వాగతం పలుకతున్న అర్చకులు

శాస్త్రీయ పద్ధతిలో విచారణ జరపాలి



నేరసమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డీజీపీ జితేందర్

- నేర పరిశోధన, నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం
- సున్నితమైన ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా పెట్టాలి
- తెలంగాణలో మావోయిస్టులు లేరు
- డీజీపీ జితేందర్

కరీంనగర్ క్రైం, ఆగస్టు 20 : కేసుల విచారణ శాస్త్రీయ పద్ధతిలో జరపాలని, నేర ఘటనలకు సంబంధించిన సాక్ష్యాధారాలను పక్కాగా సేకరించాలని రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ (డీజీపీ) డాక్టర్ జితేందర్ పోలీసు అధికారులకు సూచించారు. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో మంగళవారం కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలో డీజీపీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీజీపీ మాట్లాడుతూ కేసులు ట్రయల్స్‌కు వచ్చిన సమయంలో కేసు తీవ్రతను బట్టి అవసరమైతే డీఎస్పీలు సైతం కోర్టుకు వెళ్లి కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా వ్యవరించాలన్నారు. సీసీ కెమెరాలు నేర పరిశోధన, నియంత్రణలో కీలకంగా ఉపయోగపడతాయన్నారు. ప్రజలకు వాటి ప్రాముఖ్యతను తెలిపి అన్ని చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. డీఎస్పీ, సీఐలు, డివిజన్, సర్కిల్ వారీగా శాంతి భద్రతల సమస్యలను అధిగమించేందుకు కార్యచరణ కలిగి ఉండాలన్నారు. రౌడీషీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు, రోడ్డు ప్రమాదాలపై సమీక్ష చేశారు. మతపరమైన సమస్యలు ఏర్పడే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

సమీక్షా సమావేశానికి కరీంనగర్ కమిషనరేట్ కు వచ్చిన డీజీపీ డాక్టర్ జితేందర్‌కు మల్టీ జోన్-1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి, సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్, జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్‌లు పూల మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం సాయుధ బలగాల చేత డీజీపీ గౌరవ వందనం స్వీకరించారు. సమీక్షా సమావేశంలో కరీంనగర్ పోలీస్ కమీ షనర్ అభిషేక్ మొహంతి, సిరిసిల్ల ఎస్పీ అఖిల్‌మహాజన్, జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్, వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, మూడు జిల్లాల డీఎస్పీలు, సీఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

● శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యం

రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడడమే తమ లక్ష్యమని, దాని కోసం పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని డీజీపీ డాక్టర్ జితేందర్ అన్నారు. కరీంనగర్ కమిషనరేట్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో డీజీపీ మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణ కోసం తగు చర్యలు తీసుకుంటూనే అక్రమ ఇసుక రవాణా, సైబర్ నేరాలు, డ్రగ్స్ కంట్రోల్, గంజాయి అక్రమ రవాణా, సరఫరాపై డేగ కన్నేసినట్లు తెలిపారు. భూకబ్జాలను అరికట్టడంలో అన్ని రాష్ట్రాల కంటే ముందున్నామన్నారు. ఇతర ప్రాంతాల నుంచి డ్రగ్స్ సరఫరా అవుతున్నట్లు వస్తున్న సమాచారం మేరకు అప్రమత్తమై చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరలో సిబ్బంది కొరతను పూర్తిగా అధిగమిస్తామని అన్నారు. 13 వేల మంది ప్రస్తుతం శిక్షణలో ఉన్నారని, రెండు, మూడు నెలల్లో విధుల్లో చేరుతారని డీజీపీ తెలిపారు. గంజాయి సరఫరా చేసే వారి కదలికలపై ఆరా తీస్తున్నామన్నారు.

తెలంగాణలో గంజాయి ఉత్పత్తి లేదని, ఆంధ్రా ఒడిస్సా సరిహద్దు ప్రాంతం నుంచి సరఫరా అవుతుందన్నారు. రాష్ట్రంలో మావోయిస్టులు లేరని, ఇతర రాష్ట్రాలకు పారిపోయారన్నారు. సైబర్ క్రైం బ్యూరోను దేశంలో తెలంగాణలోనే మొదటగా ఏర్పాటు చేసి 85 కోట్ల రూపాయలు రికవరీ చేసి బాధితులకు అందజేశామన్నారు. కరీంనగర్ కమిషనరేట్‌లో కోటి 60 లక్షలు రికవరీ చేశామన్నారు. సైబర్ నేరాల్లో చిక్కుకుని డబ్బులు పోగొట్టుకున్నవారు వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1930కు ఫోన్ చేసి సమాచారం అందిస్తే నిమిషాలలో ఆ బ్యాంక్ ఖాతాను ఫ్రీజ్ చేసి ట్రాన్స్‌ఫర్ అయిన డబ్బులను వెనక్కి తీసుకువస్తామన్నారు. నార్కోటిక్ బ్యూరోను కూడా సీనియర్ అధికారులతో ఏర్పాటు చేశామన్నారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ చాలా స్ట్రిక్ట్ ఆఫీసనే విషయం తెలుసుకదా... ఈఓడబ్ల్యు కొనసాగుతుందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో కరీంనగర్ రేంజ్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి, జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్, రాజన్న సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహజన్, ట్రైనీ ఐపీఎస్, వేములవాడ ఏఎస్పీ శేషాద్రినీరెడ్డిలు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన మూడు జిల్లాల పోలీసు ఉన్నతాధికారులు

బీసీ గణన తర్వాతనే

'స్థానిక' ఎన్నికలు నిర్వహించాలి..

పెద్దపల్లి బీసీ సదస్సులో నాయకుల డిమాండ్..

పెద్దపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గడిచిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు తక్షణమే బీసీ గణన చేపట్టాలని, ఆ తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజూరి శ్రీనివాస్, విశ్రాంత ఐఎఎస్ అధికారి చిరంజీవి, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ డిమాండ్ చేశారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి బీసీ సదస్సును నిర్వహించారు. ముందుగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సదస్సులో బీసీ జాతీయ నాయకుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సదస్సుకు హాజరైన వారినుద్దేశించి సదరు నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలపై వివక్ష చూపుతున్నదని, దీనిని ఖండిస్తున్నామన్నారు. పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం సదస్సును ఉద్దేశించి మాట్లాడిన విశ్రాంత ఐఏఎస్ అధికారి చిరంజీవులు ఓబీసీల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను వివరించారు.


స్వాతం త్రం వచ్చినప్పటి నుంచి నేటికీ బీసీ గణన జరగ లేదని పేర్కొన్నారు. భారతదేశాన్ని పాలించిన తెల్ల దొరలు ఓబీసీ గణన చేశారే తప్ప స్వతంత్ర భారతదేశంలో బీసీ గణనకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా బీసీ సామాజిక వర్గానికి చెందిన అనేక మంది ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ జనగణన చేస్తామని మాట ఇచ్చి కేబినెట్‌లో తీర్మానం చేసిందే తప్ప ఇప్పటి వరకు కార్యాచరణ చేపట్టలేదన్నారు. బీసీ గణన చేయకుండానే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నద్ధం అవుతున్నదని, బీసీ గణన చేపట్టే వరకు స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించవద్దని అన్నారు. బీసీల తలరాతలు మారాలంటే వెంటనే బీసీ గణన చేపట్టాలని జాజుల శ్రీనివాస్ గౌడ్, చిరంజీవులు, పుట్ట మధూకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో బీసీ జనసభ అధ్యక్షులు రాజారామ్ యాదవ్ సోషలిస్టు పార్టీ అధ్యక్షులు పిడికిలి రాజు, మాజీ జడ్పీటీసీలు గంటా రాములు యాదవ్, కందుల సంధ్యారాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్, బీసీ నాయకులు బండారు శ్రీనివాస్, కొలిపాక శ్రీనివాస్, మారం తిరుపతి యాదవ్, శిలారపు పర్వతాలు, మాజీ మున్సిపల్ చైర్మన్ పుట్టా శైలజ, మాజీ జడ్పీటీసీ సంపత్ యాదవ్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు నల్లవెల్లి శంకర్, పడాల రవీందర్ గౌడ్, చంద్రమౌళి, పొట్యాల మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.



జాతీయ బీసీ నాయకులకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీసీ నాయకులు

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య



మల్లేశం (ఫైల్)

ముస్తాబాద్, అగస్టు 20: రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో అప్పులబాధతో కౌలు రైతు బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్‌కు చెందిన వేముల మల్లేశం (40) మూడు సార్లు గల్ఫ్ వెళ్లి అక్కడ సరైన ఉపాధి దొరకక తిరిగి వచ్చాడు. అప్పులు తీర్చే మార్గం లేక స్థానికంగా ఐదెక రాల పొలాన్ని కౌలుకు తీసుకొని వరినాటు వేశాడు. గల్ఫ్ అప్పులు, సాగు కోసం చేసిన అప్పులు ఐదు లక్షల రూపాయలు తీర్చే మార్గం లేక అప్పుల బాధతో మనస్థాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.మల్లేశంకు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. ఎస్సై సీహెచ్ గణేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గేదెపై వీధి కుక్కల దాడి

తిమ్మాపూర్, ఆగస్టు 20: మండలంలోని మహాత్మానగర్ గ్రామంలో వీధి కుక్కలు వీరంగం వేశాయి. ఎల్ఎండీ కాలనీలోని చిందం రాజు అనే రైతు తన గేదె ను తన ఇంటి పక్కన ఉన్న తన పశువులను కట్టేశాడు. అర్ధరాత్రి సమయంలో కొన్ని వీధి కుక్కలు పశువులపై దాడి చేసి అందులో ఉన్న గేదెను హత మార్చాయి. అక్కడ ఉన్న మిగతా పశువులపై దాడి చేసేందుకు ప్రయత్నించాయి. చప్పుడు వినిపించి నిద్ర లేచిన రైతు రాజు కుక్కలను అక్కడి నుంచి వెళ్లగొట్టాడు. మృతి చెందిన గేదె విలువ 20వేల రూపాయలు ఉంటుందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని రాజు కోరాడు.

విద్యుత్‌షాక్ తో గేదె మృతి

జగిత్యాలరూరల్,ఆగస్టు 20: మండలంలోని నర్సింగాపూర్ కు చెందిన గడ్డం మల్లయ్యకు చెందిన గేదె విద్యుత్‌షాక్‌తో మంగళవారం మృతి చెం ది నట్లు నర్సింగాపూర్ గ్రామస్థులు తెలిపారు. సోమవారం అదే గ్రామానికి చెందిన మద్దెల లచ్చన్నకు చెందిన గేదె మృతి చెందింది. రెండు రోజుల వ్యవధిలో రెండు గేదెలు విద్యుత్‌షాక్‌తో మృతి చెందడంపై గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.

చేనేత టెక్నాలజీ కోర్సులకు పిల్లలను పంపించాలి

టేస్కో జీఎం అశోక్‌రావు



సిరిసిల్లలో మాట్లాడుతున్న టేస్కో జీఎం అశోక్‌రావు

సిరిసిల్ల రూరల్, అగస్టు 20 : తెలంగాణ రాష్ట్రానికి నూతనంగా మంజూరైన ఇండియన్స్ ఇన్స్టిట్యూట్ అఫ్ హండ్లూం టెక్నాలజీలో చేనేత, టెక్స్‌టైల్ టెక్నాలజీ డిప్లొమా కోర్సుల్లో పిల్లలను చేర్పించేందుకు నేతన్నలు తమ పిల్లలను పంపించాలని టేస్కో జనరల్ మేనేజర్ అశోక్‌రావు కోరారు. సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌లోని చేనేత జౌళీ శాఖ కార్యాలయంలో మంగళవారం ఇండియన్స్ ఇన్స్టిట్యూట్ అఫ్ హ్యాడ్లూం టెక్నాలజీలో చేనేత, టెక్స్‌టైల్ టెక్నాలజీ డిప్లొమా కోర్స్‌లపై నేతన్నలకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు హాజరై మాట్లాడరు. రాష్ట్రానికి మంజూరైన దీనిలో మొదటి సంవత్సరం కోర్సులలో చదువుతోపాటు నేర్చుకునేందుకు 60 సీట్లు కేటాయించడం జరిగిందన్నారు.

ఇందులో నేర్చుకునే వారికి ఆసక్తి ఉంటే దరఖాస్తు చేసుకునేలా నేతన్నలు పిల్లలను ప్రోత్సహించాలన్నారు. ఇందులో చేరేందుకు 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారై ఉండడంతో పాటు 01-07-2024 నాటికి బీసీ, జనరల్ కేటగిరీలకు 23 సంవత్సరాలు కలిగి ఉండాలని అలాగే షెడ్యూల్ కులాలకు చెందిన వారైతే 25 సంవత్సరాలు ఉన్నవారి అనుమతులు ఉంటాయన్నారు. అర్హులైన వారు ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేసుకోవాలని పూర్తి వివరాల కోసం బీవైనగర్‌లోని చేనేత జౌళీ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో చేనేత జౌళీశాఖ ఏడీ మిట్టకోల సాగర్, మ్యాక్స్ సంఘాల అధ్యక్షులు, ఎస్ఎస్ఐ యూనిట్‌ల యాజమానులు, చేనేత సహకార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



పాల్గొన్న యాజమానులు, ఆసాములు

రాష్ట్ర చాంపియన్‌షిప్ సాధించిన అథ్లెట్స్

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 20: రాష్ట్ర పురుషుల, మహిళల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌ను జిల్లా క్రీడాకారులు సాధించారు. ఈనెల 17,18వ తేదీల్లో మెదక్ జిల్లాలో జరిగిన తెలంగాణ అండర్- 23 పురుషుల, మహిళల అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పాల్గొని వివిధ అంశాలలో పతకాలను సాధించారని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కడారి రవి తెలిపారు. మహిళల లాంగ్ జంప్‌లో సిహెచ్ పూజ బంగారు పతకం, వంద మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం సాధించింది. యం వినయ్ 3వేల మీటర్ల పరుగులో బంగారు పతకం, 100మీటర్ల పరుగులో కాంస్య పతకం సాధించాడు. ఇ.విష్ణువర్ధన్ 20కిలో మీటర్ల రేస్ వాక్‌లో బంగారు పతకం, కె.వైష్ణవి 400మీటర్ల పరుగుపందెంలో రజత పతకం, 2వందల మీటర్ల పరుగులో కాంస్య పతకం సాధించారు. ఎస్ అజయ్ 20కిలో మీటర్ల రేస్ వాక్‌లో రజత పతకం, కె.రవి 800మీటర్ల పరుగులో కాంస్య పతకం సాధించారు. ఎ సంతోష్ 3వేల మీటర్ల స్ట్రీపుల్ చేస్‌లో రజత పతకం, ఎ వివేకానంద ట్రిపుల్ జంప్‌లో రజత పతకం, కె స్వామి జావలెన్ త్రోలో రజత పతకం, డి. మాలుపతి 100మీటర్ల పరుగులో రజత పతకం సాదించి అండర్ 23 సంవత్సర విభాగంలో చాంపియన్‌లుగా నిలిచారని తెలిపారు. ఈ సందర్భంగా క్రీడా కారులను, వారికి శిక్షణ ఇచ్చిన కోచ్‌లు వరుణ్ కృష్ణన్, తిరుపతి లను జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు నందెల్లి మహిపాల్, డివైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, అథ్లెటిక్ అసోసియేషన్ బాధ్యులు బి.రాజగోపాలచారి, కటకం రవి, హరికిషన్, సుమన్ కళ్యాణ్, రమేష్, బిషన్‌సింగ్, కార్యదర్శి కడారి రవి అభినందించారు.



పతకాలు సాధించిన అథ్లెటిక్స్

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థులు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, ఆగస్టు 20: రాష్ట్రస్థాయి జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీలకు కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. మంగళవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అల్ఫోర్స్ చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో బాస్కెట్‌బాల్‌కు ప్రత్యేకత ఉందన్నారు. విద్యార్థులకు పోటీతత్వంతో పాటు సత్సంబంధాలు ఏర్పరిచే విధంగా ఉంటా యన్నారు. ప్రతి విద్యార్థిక్రీడా రంగాల్లో పాల్గొని ముందుకు సాగాల న్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ అసోసియేషన్ నిర్వహించిన పోటీల్లో పాఠశా లకు చెందిన అశ్విన్, జి రాఘవేంద్ర కె సిద్ధార్థ, మోహనిష్, మోట్వాని శరన్, రణధీర్‌లు బాలుర విభాగంలో, బాలికల విభాగంలో ముగ్ధా, సనికిత్, జస్లిన్, కె.పూజిత చౌదరి అత్యుత్తమ ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 25, 26తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీ లకు ఎంపికవడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమాజ అభివృద్ధికి మార్గదర్శకులు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 20: ఉపాధ్యాయులు సమాజ అభివృద్ధికి మార్గదర్శకులని వారు ఉత్తమ భవిష్యత్తుకు పునాదులు వేస్తారని లయన్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. సమన్వయకర్త లయన్ కెప్టెన్ బి.మధుసూదన్‌రెడ్డి, ఇతర బాధ్యులతో కలిసి స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీటాట్స్ ప్రాంగణంలో వేడుకగా నిర్వహించిన లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ టీచర్స్ రీ-క్వెస్ట్ ముగింపు కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన ప్రశంసాపత్రాల ప్రదానోత్సవానికి నరేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు రెండు రోజుల వర్క్‌షాపు చాలా విషయాలను నేర్చుకున్నారని మరియు సవాళ్లను ఏవిధంగా ఎదుర్కోవాలో తెల్సుకోవడమే కాకుండా విషయాలను సృజనాత్మకంగా బోధించడం, యవ్వనదశలో ఎదురవుతున్న సమస్యలు ఏవిధంగా పరిష్కరించాలో తెలుసుకున్నారని చెప్పారు. ప్రత్యేకంగా అల్ఫోర్స్ విద్యాసంస్థలను ఎంపిక చేసినందుకు లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ వారికి ధన్యవాదాలు తెలియజేశారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్ర మాలను అల్ఫోర్స్ విద్యాసంస్థలకు కేటాయించాలని కోరారు.

ఉపాధ్యాయులు ఆనందాన్ని వ్యక్తం చేస్తూ భవిష్యత్తులోను మరిన్ని విషయాలతో ఉత్తమంగా శిక్షణ అందించాలని కోరారు. ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో భాగంగా అనేక ప్రోత్సాహక కార్యక్రమాలను నిర్వహించి ఉపాధ్యాయుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికి తీయడమే కాకుండా ప్రశంసా పత్రాలతో ఘనంగా సత్కరించి ఉపాధ్యాయ వృత్తికి మరింత వన్నె తేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త ఇ. సింగమరాజు, కోశాధికారి వి.సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ మందిరానికి రూ.లక్ష విరాళం



లక్ష రూపాయల చెక్కును అందజేస్తున్న కార్పొరేటర్ సరిత సతీష్‌కుమార్

కరీంనగర్ టౌన్, ఆగస్టు 20: నగరంలోని శాతవాహన యూనివర్శిటీ సమీపంలోని శ్రీరాంనగర్‌కాలనీ రోడ్‌నెంబర్ -7లో నూతనంగా నిర్మించిన శ్రీరామమందిర ప్రతిష్ఠ మహోత్సవాలకు కార్పొరేటర్ కొండపల్లి సరిత సతీష్ రూ.లక్ష విరాళంగా ఇచ్చారు. ఈమేరకు మంగళవారం వారి వివాహ మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి అక్కడే శ్రీరాంనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డి.మాధవరావు, గజవాడ ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు బల్మూరి విజయసింహారావు, కోశాధికారి నర్సింహాచారికి లక్ష రూపాయల చెక్కును విరాళంగా అందించారు.

కరాటేలో బంగారు పతకం



హుమేరా తస్నీమ్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

హుజూరాబాద్, ఆగస్టు 20: పట్టణానికి చెందిన హుమేరా తస్నీమ్ గ్లోబల్ చోటాఖాన్ కరాటే దు ఇండియా జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే టోర్న మెంట్‌లో బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా మాంటిస్సోరి పాఠశాల యాజ మాన్యం విద్యార్థి హుమేరా తస్నీమ్‌ను మంగళవారం అభినందించింది.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



హుజూరాబాద్‌లో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్, ఆగస్టు 20: వివిధ కారణాల వల్ల అనారోగ్యంతో చికిత్స పొందిన బాధిత కుటుంబాలకు మంగళవారం ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు కాకుండా అనారోగ్యంతో బాధపడుతున్న వారందరికి ప్రభుత్వం చొరవ తీసుకొని పూర్తిస్థాయిలో ఉచిత వైద్యాన్ని అందిస్తే బాగుంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, కొలిపాక శ్రీనివాస్, ప్రతాప తిరుమల్‌రెడ్డి, తాళ్లపల్లి శ్రీనివాస్, కేసిరెడ్డి లావణ్య, పూర్ణచందర్, రమాదేవి పాల్గొన్నారు.

తాడికల్‌లో జ్వర సర్వే, డ్రై డే



పరిసరాల పరిశుభ్రతపై అవగాన కల్పిస్తున్న మండల వైద్యాధికారి

శంకరపట్నం, ఆగస్టు 20: మండలంలోని తాడికల్ గ్రామంలో మండల వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది జ్వర సర్వే, డ్రై డే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ వ్యక్తిగత ఆరోగ్య వివరాలను నమోదు చేసుకున్నారు. జ్వరం, ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి మందులు అందజేసి, తగు సూచనలు చేశారు. డ్రై డే కార్యక్రమం నిర్వహించి డెంగ్యూ వ్యాప్తి చెందే విధానాన్ని ప్రజలకు వివరించారు. సర్వేను డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

యువత రాజీవ్‌గాంధీని ఆదర్శంగా తీసుకోవాలి

-మానకొండూరు ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణ -రాజీవ్‌గాంధీకి కాంగ్రెస్ నాయకుల ఘన నివాళి





రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి, హుజూరాబాద్‌లో కాంగ్రెస్ నాయకుల నివాళి

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 20: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీని యువత ఆదర్శంగా తీసుకోవాలని మానకొండూరు ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. రాజీవ్‌గాంధీ దేశంలో యువతకు ఓటు హక్కు కల్పన, టెలి కమ్యూనికేషన్ సంస్కరణల రూపకర్తని అన్నారు. డీసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మంగళవారం రాజీవ్‌గాంధీ 80వ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణ, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి పురుమల్ల శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకారపు భాస్కర్‌రెడ్డి, రాజీవ్ గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ నేటి తరానికి ఆదర్శప్రాయులని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మడుపు మోహన్, మల్లికార్జున రాజేందర్, ఎండి తాజ్, శ్రావణ్ నాయక్, గడ్డం విలాస్‌రెడ్డి, కలవల రామచందర్, బొబ్బిలి విక్టర్, ఎస్‌ఏ మోసిన్, ఆహమ్మద్ అలీ, ములకల ప్రవీణ్, కర్ర రాజశేఖర్, అంతగిరి వినయ్, గోపు మల్లారెడ్డి, ఎం కేశవరెడ్డి, నిహాల్ అహ్మద్, బాకారప్ శివయ్య, వంగల విద్యాసాగర్, నాగుల సతీష్, ముస్తాక్ అహ్మద్, మెతుకు కాంతయ్య, రాచర్ల పద్మ పాల్గొన్నారు.

●హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని డిపో క్రాస్ రోడ్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొల్లూరి కిరణ్, సొల్లు బాబు, వడ్లూరి విజయ్‌కుమార్, తోట రాజేంద్రప్రసాద్, మిడిదొడ్డి రాజు, లావణ్య, పుష్పలత, సుశీల, ఎండీ సజ్జు, ఎండీ అప్సర్, ఎండీ తౌసీఫ్, శంకర్, కిరణ్‌రెడ్డి, బాబు, సంపత్, నరేష్, శ్రావణ్, రత్నాకర్‌రెడ్డి, రామకృష్ణ, కుమారస్వామి, తిరుపతి, విజేందర్, అయిలయ్య, పోచయ్య, నర్సింహారెడ్డి, స్వామిరెడ్డి పాల్గొన్నారు.

●శంకరపట్నం: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు.

●ఇల్లందకుంట:మండల కేంద్రంలో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయ కుడు వంగ రామకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిం చారు. కార్యక్రమంలో గుడేపు సారంగపాణి, గుడేపు ఓదెలు, గోపాల్‌రెడ్డి, మహేందర్‌వర్మ, తిరుపతిరెడ్డి, రవి, రాజేశం, తిరుపతి, సంపత్, వీరారెడ్డి, ఎల్లయ్య, రాంరెడ్డి, సాయిరాం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

●సైదాపూర్: మండల కేంద్రంలో రాజీవ్‌గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుధాకర్, సీనియర్ నాయకుడు గుండారపు శ్రీనివాస్, నాయకులు కూతురు విద్యాన్ రెడ్డి, సారబుడ్ల రాజిరెడ్డి, బొమ్మగాని రాజు పాల్గొన్నారు.

●వీణవంక: మండల కేంద్రంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. కార్యక్రమంలో నాయకులు గంగాడి రాజిరెడ్డి, పంజాల సతీష్, గూటం సమ్మిరెడ్డి, చినాల అయి లయ్య, నల్లకొండాల్‌రెడ్డి, సాహెబ్ హుస్సేన్, మధుకర్ రెడ్డి, తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

●గంగాధర: గంగాధరలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రె స్ పార్టీ మండలాధ్యక్షుడు మనోహర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

●చొప్పదండి: చొప్పదండిలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ముద్దం తిరుపతి గౌడ్,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి,మార్కెట్ చైర్మన్ కొత్తూరు మహేష్ వైస్‌చైర్మన్ మునగాల రాజేందర్, నాయకులు పెరుమండ్ల గంగయ్య గౌడ్,పురం రాజేశం, మునిగాల చందు, కనుమల రాజశేఖర్ ,నిఖిల్ బొడిగె తిరుపతి, నెట్టు శీను తదితరులు పాల్గొన్నారు.

●చిగురుమామిడి: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, జిల్లా నాయకులు చిట్టు మల్ల రవీందర్, వేణు, ప్రశాంత్, ఐరెడ్డి సత్యనారయణరెడ్డి, సుధకర్‌రెడ్డి, వంగర మల్లేశం, రమణయ్య, కిషన్‌రెడ్డి, ప్రవీణ్, ఎలగందుల లక్ష్మణ్, రాజు, అనిల్, శ్రీనివాస్, తిరుమల్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధిపై దృష్టి సారించాలి

-బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్

కరీంనగర్ టౌన్, ఆగస్టు 20: కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్‌ఎస్‌పై అనవసర విమర్శలు మాని అభివృద్ధిపై దృష్టి సారించాలని బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ అన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని పక్కనబెట్టి బీఆర్‌ఎస్ పార్టీ కాంగ్రెస్‌లో విలీనమవుతుందంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్, బీజేపీలో విలీనం చేస్తారంటూ సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. మంగళవారం బీఆర్‌ఎస్ నగరశాఖ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు అవుతున్నా, కేంద్రమంత్రిగా సంజయ్ బాధ్యతలు చేపట్టి మూడు నెలలు అవుతున్నా వారు ప్రజలకు ఇచ్చిన హామీలపై దృష్టిపెట్టకుండా బీఆర్‌ఎస్ పార్టీనీ, కేసీఆర్, కేటీఆర్‌లనే టార్గెట్ చేస్తూ మాట్లాడుతున్నారని విమర్శించారు. విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ నగర ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్‌రెడ్డి, నాయకులు బోనకుర్తి సాయికృష్ణ షౌకత్, వాజిద్ పాల్గొన్నారు.

మున్నూరుకాపు కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి

కరీంనగర్ టౌన్, ఆగస్టు 20: రాష్ట్ర మున్నూరుకాపు కార్పొరేషన్ నిర్వహణ కోసం ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించాలని మున్నూరుకాపు సంఘం నాయకులు మౌనదీక్షలు చేపట్టారు. మంగళవారం మున్నూరుకాపు సంఘం రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ వొంటెల రత్నాకర్ నేతృత్వంలో నగరంలోని కాపు వాడలో సంఘం నాయకులు మౌనదీక్షను ప్రారంభించారు. ఈనెల 20నుంచి 25వ తేదీ వరకు మౌన పోరాట దీక్షలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్ర మంలో కాపు వాడ సంఘం అధ్యక్షుడు బొమ్మరాతి రాంచంద్రం, కార్యదర్శి ఆకుల యాదయ్య, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేశ్, జిల్లా అధ్యక్షుడు బొమ్మ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అనంత లోకాలకు చేరిన సాహితీ 'ముత్యం'



డాక్టర్ కె ముత్యం(ఫైల్)

కరీంనగర్ కల్చరల్/గణేష్‌నగర్, ఆగస్టు 20: అనంత లోకాలకు ఓ సాహితీ 'ముత్యం' చేరింది. కరీంనగర్‌లో శాతవాహన విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖ ప్రారంభమైన నాటి (2009) నుంచి ఒప్పంద అధ్యాపకుడిగా పని చేసి పదవీ విరమణ పొందిన డాక్టర్ కొట్టూరు ముత్యం ఇక లేరు. అనారోగ్యంతో ఉన్న ఆయన మంగళవారం తెల్లవారుజామున 2గంటలకు హైదరాబాద్ లోని లింగంపల్లి గుల్మహర్ కాలనీలో తుది శ్వాస విడిచారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలంలోని బాచనపల్లిలో జన్మించిన ఆయన ఉస్మానియా యూనివర్సిటీ నుంచి తెలుగులో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేశారు. ఆయనకు భార్య డాక్టర్ అపర్ణ (గచ్చిబౌలిలో కేంద్రీయ విశ్వవిద్యాలయంలో హిందీ భాష అధ్యాపకురాలు), కూతురు ప్రత్యూష యామిని, కుమారుడు వసంత్ ఉన్నారు. 1993లో శ్రీకాకుళ ఉద్యమ సాహిత్యం అన్న పరిశోధక సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించి బెనారస్ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ప్రజా కవి, రచయిత, గాయకుడు సుబ్బారావు పాణిగ్రహి జీవిత చరిత్రను ఆధారాలతో రికార్డు చేసి అందించారు. డాక్టర్ ముత్యం 25కు పైగా పుస్తకాలు ప్రచురించారు. శాతవాహన యూని వర్సిటీలో తెలుగు శాఖకు తొలి ఇన్‌చార్జి అధిపతిగా పనిచేశారు. భాషా, సాహిత్య, చారిత్రక అంశాలపై అనేక సదస్సులు నిర్వహిం చారు. డాక్టర్ కె ముత్యం మృతిపై పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్‌లాల్, డాక్టర్ గండ్ర లక్ష్మణరావు, డాక్టర్ నలిమెల భాస్కర్, డాక్టర్ కె రామకృష్ణ, మాడిశెట్టి గోపాల్, కేఎస్ అనంతాచార్య, సివి కుమార్, దామెరకుంట శంకరయ్య, విలాసాగరం రవీందర్, పెనుగొండ బసవేశ్వర్, సరసిజ, అన్నవరం దేవేందర్, తుల రాజేందర్, గాజోజు నాగభూషణం, సవ్యసాచి, డాక్టర్ బీవీఎన్ స్వామి, వేంకటేశ్వర్లు, బొద్దుల లక్ష్మయ్య, కూకట్ల తిరుపతి, వైరాగ్యం ప్రభాకర్, బూర్ల వెంకటే శ్వర్లు, కందుకూరి అంజయ్య, గాజుల రవీందర్, నంది శ్రీనివాస్, వరప్రసాద్, సుధాకర్, ఆవునూరి సమ్మయ్య, బండి చంద్రశేఖర్, జగన్నాథం, చెరుకు సుధాకర్, రవి, బైస రామదాసు, అన్వర్, కొత్త అనిల్‌కుమార్, కాండూరి వేంకటేశ్వర్లు, రాజారాంమోహన్, ఆముక్తమాల్యద సంతాపం వ్యక్తం చేశారు.

● శాతవాహన యూనివర్సిటీలో..

శాతవాహన యూనివర్సిటీలో డాక్టర్ కె ముత్యం మృతికి సంతాపం ప్రకటించారు. ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ వరప్రసాద్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహమ్మద్ జాఫర్, అధ్యాపకులు హుమేరా, పద్మావతి, శ్రీవాణి, లక్ష్మీనారాయణ, కృష్ణరావు, మున్వర్, అబ్రార్, విజయ్ ప్రకాశ్, మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

కష్టపడ్డ ప్రతీ కార్యకర్తను నాయకుడిగా తయారు చేస్తాం



మార్కెట్ కమిటీల పాలకవర్గ సభ్యులతో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్, ఆగస్టు 20: పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతీ కార్యకర్తను నాయకుడిగా తయారు చేస్తామని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని ఎల్ఎండీ కాలనీలోని క్యాంప్ కార్యలయంలో మానకొండూర్, బెజ్జంకి, ఇల్లంతకుంటవ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్, వైస్ చైర్మన్, పాలక వర్గ సభ్యులకు మంగళవారం ఆయన నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భం గా వారిని సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం అవకాశం రాని నాయకులకు, కార్యకర్తలకు రాబోయే రోజుల్లో అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. మార్కెట్ కమిటీల్లో నియమితులైన వారు నిరంతరం రైతులకు అందుబాటులో ఉండి వారికి సేవలు అందించాలని సూచించారు.

● మానకొండూర్: మానకొండూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా పాఖాల వందన, సాయిరి దేవయ్య, టేకుమల్ల అంజయ్య వేల్పుగొండ రాజు, చలిగంటి ఓదెలు, మాతంగి సహదేవ్, దాసరి శ్రీనివాస్, బండెల మహేందర్, మండల మహిపాల్‌రెడ్డి, రావుల రవి, రేమిడి శ్రీనివాస్‌రెడ్డి, గాజుల వెంకటేశ్వర్లు ఎంపికయ్యారు. వీరందరికీ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నియామకపత్రాలు అందజేశారు.

● మంత్రి పొన్నంను కలిసిన మార్కెట్ కమిటీ డైరెక్టర్లు

గన్నేరువరం: ఉమ్మడి బెజ్జంకి మండలం మార్కెట్ కమిటీలో మండల కేంద్రానికి చెందిన నల్ల చంద్రారెడ్డి, మాతంగి అనిల్, మైలారం గ్రామానికి చెందిన వొడ్నాల నర్సయ్య, గుండ్లపల్లికి చెందిన చాడ సతీష్‌రెడ్డి, గునుకుల కొండాపూర్ గ్రామానికి చెందిన న్యాలపట్ల కనుకయ్యలు డైరెక్టర్లుగా నియమితులయ్యారు. వీరు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

శంకరపట్నం, ఆగస్టు 20: మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఇటీవల సెల్‌ఫోన్స్ పొగొట్టుకొని ఫిర్యాదు చేయగా, కేశవపట్నం ఎస్‌ఐ కొత్తపల్లి రవి మొబైల్స్‌ను తిరిగి వారికి అందజేశారు. కొత్తగట్టుకు చెందిన తీగల వెంకటేష్, ముత్తారం గ్రామానికి చెందిన నూనె మహేందర్ ఇటీవల ఫోన్స్ పొగొట్టుకొని సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మొబైల్ ఫోన్లను కనుక్కొని వారికి అందజేసినట్లు ఎస్‌ఐ రవి పేర్కొన్నారు.

'ఆలయ నిర్మాణాలను అడ్డుకుంటే ఊరుకోం'

రామడుగు, ఆగస్టు 20: మండలంలోని గోపాల్‌రావుపేటలోని హనుమాన్, ఉర పోచమ్మ, నల్ల పోచమ్మ ఆలయాల పునర్నిర్మాణ పనులను అడ్డుకుంటే ఆందోళన చేస్తామని దేవాలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు అన్నారు. కొందరు తమ స్వార్థం కోసం నిర్మాణాలను అడ్డుకుంటున్నారని వారు విమర్శించారు. దేవాలయాలను పూర్వస్థలంలో నిర్మిస్తున్నప్పటికీ కొందరు రాజకీయ దురుద్దేశంతో పనులను అడ్డుకుంటున్నారన్నారు. రాజకీయ నాయకుల అండదండలతో అధికారుల ద్వారా పనులను నిలిపివేయాలంటూ ఆదేశాలు ఇప్పిస్తూ ఇబ్బందిపాలు చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో దాతల సహాయ సహకారాలతో నిర్మాణం చేపడుతుండగా మాజీ సర్పంచ్ దంపతులు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారని విమర్శించారు. వారం రోజుల లోపు స్పష్టత ఇవ్వకపోతే ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

'బంద్‌ను విజయవంతం చేయండి'

గంగాధర, ఆగస్టు 20: వర్గీకరణ తీర్పును నిరసిస్తూ బుధవారం తలపెట్టిన దేశవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని మాల మహానాడు రాష్ట్ర నాయకుడు, న్యాయవాది వీరస్వామి ఓ ప్రకటనలో కోరారు. దళితుల మధ్య చిచ్చుపెట్టి విడదీయాలని చూస్తే సహించేది లేదన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల కుట్రలను తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

గంగాధరలో బంద్ సంపూర్ణం

గంగాధర, ఆగస్టు 20: హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన గంగాధర బంద్ విజయవంతమైంది. బంద్ సందర్భంగా గంగాధర ప్రధాన రహదారిపై వ్యాపార సముదాయాలను యాజమానులు స్వచ్ఛందంగా మూసివేయగా ప్రైవేటు విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. హిందూ నాయకులు గంగాధర ప్రధాన రహదారిపై వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందూవులపై, హిందు దేవాలయాలపై దాడులను తీవ్రంగా ఖండించారు. హిందువులకు మద్దతుగా నిలిచి బంద్‌లో పాల్గొన్న వ్యాపారులు, హోటళ్లు, విద్యాసంస్థలు, షాపింగ్ మాల్స్ యాజమానులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హిందూ ఐక్యవేదిక సభ్యులు పాల్గొన్నారు.

రుణమాఫీ సమస్యలపై దరఖాస్తుల స్వీకరణ



చొప్పదండిలో దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

చొప్పదండి ,ఆగస్టు 20: చొప్పదండి రైతువేదికలో రుణమాఫీ సమస్యలపై రైతుల నుంచి మంగళవారం వ్యవసాయ శాఖ అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. పది రోజుల పాటు దరఖాస్తుల స్వీకరిస్తామని మండల వ్యవసాయ అధికారి వంశీకృష్ణ తెలిపారు. మండలంలోని విస్తరణ అధికారులు అందుబాటులో ఉంటారని, రుణమాఫీ కాని రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

● శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం రైతు వేదికలో రుణమాఫీ కానీ రైతుల నుంచి ఏవో వెంకటేష్ ఆధ్వర్యంలో ఏఈవోలు దరఖాస్తులు స్వీకరించారు.

● గంగాధర: గంగాధర రైతు వేదికలో రుణమాఫీ కాని రైతుల నుంచి వ్యవసాయశాఖ అధికారులు దరఖాసులు స్వీకరించారు. ఈసందర్భంగా ఏవో శ్రీనివాస్ మాట్లాడుతూ రుణమాఫీ కానీ రైతులు ఆధార్‌కార్డులు, రేషన్ కార్డు, పట్టదారు పుస్తకం, రుణ ఖాతా పుస్తకం జిరాక్స్ కాపీ అందించాలన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ టౌన్, ఆగస్టు 20: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానం చేసేందుకు ఔత్సాహిక, అర్హత కలిగిన జడ్పీ, ప్రభుత్వ ఎయిడెడ్, కేజీబీవీ, టీఎస్‌ఆర్‌డబ్ల్యూఎస్, టిడబ్ల్యూఏహెచ్‌ఎస్, ఎంజేపీహెచ్‌ఎస్ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్ ప్రధానోపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సిహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు తెలిపారు. ఈనెల 24 ఉదయం 11.30 గంటల్లోగా నేరుగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని సూచించారు.

గొర్రెల దొంగను పట్టుకున్న గ్రామస్థులు

గంగాధర, ఆగస్టు 20: మండలంలోని ఆచంపల్లిలో గొర్రెలను ఎత్తుకు పోతున్న ఓ వ్యక్తిని గ్రామస్థులు మంగళవారం రాత్రి పట్టుకున్నారు. ఆచంపల్లిలో రోడ్డు పక్కన ఉన్న పొలాల్లో గొర్రెల మందను పెట్టారు. ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు మందలో నుంచి గొర్రెను ఎత్తుకెళ్లుతుండగా గ్రామస్థులు గమనించారు. వారిని వెంబడించి ఒకరిని పట్టుకున్నారు. మరొకరు పరారైనట్లు గ్రామస్థులు తెలిపారు. పట్టుకున్న వ్యక్తిని వివరాలు అడుగగా తనది తిమ్మాపూర్ మండలం మల్లాపూర్ గ్రామంగా తెలిపాడు. ఇప్పటి వరకు వివిధ మందల్లో నుంచి 22 గొర్రెలు దొంగతన జరిగినట్లు కాపరులు తెలిపారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని నిందితుడిని స్టేషన్‌కు తరలించారు.

'ఈ కుబేర్' బిల్లులను విడుదల చేయాలి

కరీంనగర్ టౌన్, ఆగస్టు 20: 'ఈ కుబేర్'లో పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటిని వెంటనే విడుదల చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వై అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం కరీంనగర్ అంబేద్కర్ స్టేడి యంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన జిల్లా శాఖ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెడికల్ బిల్లులు, టీఎస్‌జీఎల్ఐఎఫ్ లోన్స్ తదితర బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మాడుగుల రాములు, జిల్లా బాధ్యులు చంద్రశేఖర్, వి.బాలయ్య, బాలయ్య, జింక రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పై అనవసర విమర్శలు మానుకోవాలి

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 20: కాంగ్రెస్ పార్టీపై కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ చేస్తున్న అనవసర విమర్శలను మానుకోవాలని ఆ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు ఒక ప్రకటనలో సూచించారు. సంచలనాల కోసం, మీడియాలో హెడ్ లైన్ల కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్‌పై పొంతన లేని వ్యాఖ్యలు చేయడం కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి అలవాటుగా మారిందని అన్నారు.

పారిశుధ్యంపై అవగాహన సదస్సు

కరీంనగర్ రూరల్, ఆగస్టు 20: కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలోని సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాలలో ప్రిన్సిపాల్ డా.టి.మాలతి ఆధ్వర్యంలో జంతు శాస్త్రం విభాగం వారు ప్రపంచ దోమల నివారణ దినం నిర్వహించారు. ఈసందర్భంగా బిఎస్‌సి లైఫ్ సైన్సెస్ తృతీయ సంవత్సరం విద్యార్థినులు దోమల నివారణ చర్యలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జి సుమత, జంతు శాస్త్ర విభాగాదిపతి ఎం కళ్యాణి, అధ్యాపకులు ఇమ్రోజ్, విద్యార్థినిలు పాల్గొన్నారు.

మహిళలపై అఘాయిత్యాలను అరికట్టాలి

భగత్‌నగర్, ఆగస్టు 20: మహిళలపై అఘాయిత్యాలను అరికట్టాలని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ కరీంనగర్ మహిళా విభాగం కన్వీనర్ జి.వాణి అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటనను ఖండిస్తు ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఎల్ఐసీ డివిజన్ కార్యాలయం ఎదుట మంగళవారం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్ మహిళా విభాగం కన్వీనర్ జి.వాణి మాట్లాడుతూ హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ డివిజనల్ మార్కెటింగ్ మేనేజర్ ఎంఎంఆర్‌కె శ్రీనివాస్, యూనియన్ జనరల్ సెక్రెటరీ వామన్‌రావు, ప్రెసిడెంట్ రామోహన్‌రావు, కన్వీనర్ జి.వాణి, డి.సూర్యకళ, ఎం.శ్రీలత, సి అనుపమ, ఉమెన్స్ సబ్ కమిటీ సభ్యులు అన్ని తరగతుల ఎల్ఐసి ఉద్యోగులు, బ్రాంచ్-1 ఆఫీసర్స్ మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

పారమిత పాఠశాలలో హరితహారం

భగత్‌నగర్, ఆగస్టు 20: పారమిత హెరిటేజ్ పాఠశాలలో ఏక్‌పేడ్ మాకే నామ్ అనే పేరుతో హరితహారం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రధాని మోదీ పిలుపుతో ప్రధానోపాధ్యాయులు కె.హనుమంతరావు పాఠశాలల్లో కార్యక్రమాన్ని నిర్వహించారు. పారమిత పాఠశాలల చైర్మన్ ప్రసాదరావు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రసూన, రష్మిత, అనూకర్‌రావు, రాకేష్, యుఎంప్రసాద్, రమణ, వినోద్‌రావు, హన్మంతరావు, ప్రోగ్రాం హెడ్ గోపికృష్ణ పాల్గొన్నారు.

భారత్ బంద్‌ను విజయవంతం చేయండి

సుభాష్‌నగర్, ఆగస్టు 20: ఎస్సీ ఉప కులాల ఉప వర్గీకరణకు వ్యతిరేకంగా భారత్ బంద్ పిలుపులో భాగంగా బుధవారం నిర్వహించే భారత్ బంద్‌ను కరీంనగర్‌లో విజయవంతం చేయాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ నిషాని రామచంద్రం, అల్ ఇండియా అంబేద్కర్ సంఘాల ప్రధాన కార్యదర్శి మేడి మహేష్‌లు అన్నారు. నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలోబీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి దొడ్డె సమ్మయ్య, బీఎస్పీ జిల్లా ఇంచార్జి మంద బాలయ్య, జిల్లా అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి గిన్నారపు మహేందర్, జిల్లా కార్యదర్శులు నిషాని రాజమల్లు, వేల్పుల మల్లేశం, ఆరెపల్లి వినోద్ పాల్గొన్నారు.

రుణమాఫీ ఫిర్యాదుల స్వీకరణ

కరీంనగర్ రూరల్, ఆగస్టు20: కరీంనగర్ మండలంలోని 17 గ్రామాలకు చెందిన రైతుల రుణమాఫీ ఫిర్యాదుల స్వీకరణను నగునూర్ గ్రామంలోని రైతు వేదికలో చేపట్టారు. ఆయా గ్రామాల నుంచి పలు కారణాల వల్ల రుణమాఫీ కాని రైతులు వ్యవసాయ అధికారులకు దరఖాస్తులను స్వీకరించారు. మండలంలో మొత్తం 176మంది రైతులు పలు సమస్యలపై దరఖాస్తులు మండల వ్యవసాయ శాఖ అధికారి బి. సత్యంకు అందించారు.

ఆర్టీసీకి రాఖీ బొనాంజా

భగత్‌నగర్, ఆగస్టు 20: తెలంగాణ రాష్ట్రరోడ్డు రవాణా సంస్థకు రాఖీ బొనాంజా దక్కింది. కరీంనగర్ రీజియన్ పరిధిలోని 11 డిపోల నుంచి ప్రణాళిక బద్ధం అధికారులు ఆర్టీసీ బస్సులను నడిపించడంతో ఒక్క రోజులోనే టార్గెట్ కన్నా అధిక మొత్తంలో ప్రయాణికులు ప్రయాణించడంతో అధిక ఆదాయం సమకూరింది. కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా 19వ తేదీ రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని కరీంనగర్ రీజియన్‌కు 201.64 లక్షలు టార్గెట్ కాగా, 317.57 లక్షలు రూపాయలు వచ్చాయి. 157 శాతం అధిక ఆదాయం సంపాదించారు. రాఖీపౌర్ణమిఒక్క రోజులోనే 3.56 లక్షలకిలోమీటర్లు తిరగాల్సి ఉండగా 4.30 లక్షల కిలోమీటర్ల మేర బస్సులుప్రయాణించడంతో 114 శాతం నమోదైంది. 73.91 రూపాయల ఈపికెను సాధించారు. ఒక్క రోజులోనే అక్యుపెన్సీ రేషియో 118.89 శాతంగా నమోదైంది. ఒక్క రోజులోనే 5,58,244 మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి రికార్డు మొత్తంలో ఆదాయం సమకూరింది.